

## పనులు ఆగవు.. సాగవు

బాన్సువాడ సమీకృత మార్కెట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణాలోపం స్పష్టంగా కనిపిస్తోంది.

- 9లో ▸



## బీజేపీ నాయకుల నిరసన

ఉపరాష్ట్రపతి జగదీశ్ దన్‌ఖడ్‌ను అవహేళన చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు జిల్లావ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు.

- 8లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.9 /14.1

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



పెద్దకొడప్‌గల్ : కుబ్యానాయక్ తండాలో స్కూల్ గది పక్కనే శిథిలావస్థలో ఉన్న వంటగది



పెద్దకొడప్‌గల్ : కాసిలాబాద్ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న ప్రహరీ



నాగిరెడ్డిపేటలోని స్కూల్ ఎదుట ఉన్న పోచారం ప్రధాన కాలువ

# దినదిన గండం!

- భయం గుప్పిట్లో చదువులు
- ప్రభుత్వ పాఠశాలల పరిసరాల్లో ప్రమాద హేతువులు
- శిథిలాల మధ్య విద్యార్థులకు తరగతులు
- ఎప్పుడు ఏ ముప్పు వస్తుందోననే ఆందోళన

ప్రభుత్వ పాఠశాలల విషయంలో అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. దశాబ్దాలు గడుస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమోగాని, చాలా స్కూళ్లలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయంభయంగా గడపాల్సి వస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో అనేక సమస్యలు కొట్టొచ్చినట్లు కనిపించాయి.



జెడ్పీహెచ్‌ఎస్ గంజ్ పాఠశాల ఎదుట కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



పెద్దకొడప్‌గల్ మండలం బేగంపూర్ ప్రాథమిక పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న మురికికాలువ

SAKSHI సాక్షి ఫోకస్ FOCUS

సాక్షి, కామారెడ్డి : జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు సమీపంలో కాలువలు, గుంతలు ఉన్నా వాటి వద్ద కనీస రక్షణ చర్యలు కనిపించడం లేదు. పాత భవనాలు శిథిలమై ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అవి ఎప్పుడు ప్రమాదానికి గురవుతాయోనన్న భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు. శిథిల భవనాలను కూల్చివేయాల్సి ఉన్నా ఇంకా చాలా గ్రామాల్లో శిథిల భవనాలు అలాగే ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, మారుమూల గ్రామాలు, గిరిజన తండాలలోని పాఠశాలల్లో అనేక సమస్యలు వెక్కిరిస్తున్నాయి. కొన్ని చోట్ల ప్రమాదకరంగా కాలువలు ఉన్నాయి. విద్యార్థులు స్కూల్ నుంచి ఇంటికి చేరేదాకా ఉపాధ్యాయులు భయంతో ఉండాల్సి వస్తోంది. మూడు రోజుల క్రితం కొత్తబాది పాఠశాల విద్యార్థి నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో పడి చనిపోయిన సంఘటనతో నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా తదితర ప్రాజెక్టుల పరిధిలోని కాలువలు, పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భయపడతున్నారు. చాలా స్కూళ్లలో మూత్ర శాలలు కూడా సరిగా లేకపోడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్తుంటారు. ఆటలాడుతూ పిల్లలు కొందరు కాలువల వైపునకు వెళ్లినపుడు ప్రమాదం జరిగితే తాము బలవుతామేమోనన్న భయంతో ఉపాధ్యాయులు కొంత ఇబ్బంది పడుతున్నారు. కాగా జిల్లాలోని పలు పాఠశాలల్లో కాలువలు ఇబ్బందికరంగా ఉన్నాయి. నీట మునిగి ప్రాణాలు పోయినా స్పందించే పరిస్థితుల్లో అధికారులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను 'సాక్షి' ఫోకస్ చేస్తుండగా, అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

➡ నాగిరెడ్డిపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల ముందు నుంచి పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ వెళ్తోంది. కాలువ పారుతున్నపుడల్లా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు టెన్షన్ పడుతుంటారు. పాఠశాల ఎదురుగా కాలువకు రక్షణ చర్యలు చేపడితే బాగుంటుంది.

➡ ఎల్లారెడ్డి పట్టణంలోని ఉన్నత పాఠశాలకు సమీపంలోనే పోచారం కాలువ ఉంది. విద్యార్థులు మూత్ర విసర్జనకు ఆ ప్రాంతానికి వెళ్తుంటారు. పిల్లలు ఎక్కడ ప్రమాదానికి గురవుతారో తెలియని పరిస్థితి ఉంది.

➡ కామారెడ్డి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన గేటు పక్కనే విద్యుత్తు వైర్లు తేలి ఉన్నాయి. స్తంభం కూడా ఇనుముది కావడంతో పిల్లలు ఆడుతూ అక్కడికి వస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

➡ తాడ్వాయి మండల నందివాడ, ఎండ్రియాల్ గ్రామాల్లో పాఠశాలకు సమీపంలో ఉన్న కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి.

➡ పెద్దకొడప్‌గల్ మండలంలని కుబ్యానాయక్ తండాలో పాఠశాల వంట గది, టాయ్‌లెట్స్ శిథిలావస్థకు చేరాయి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉంది.

➡ రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. తరగతి గదుల పక్కనే ప్రమాదకరంగా ఉంది.



రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో తరగతి గది పక్కన శిథిల భవనం

## న్యూస్‌రీల్

### నెలాఖరులోగా మిల్లింగ్ పూర్తి చేయాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



కామారెడ్డి క్రైం : రైస్‌మిల్లర్లు తమకు కేటాయించిన మిల్లింగ్ లక్ష్యాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. కలెక్టరెట్‌లో రైస్ మిల్లర్ల యజమానులతో గురువారం సమావేశంలో మాట్లాడారు. సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయని మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లక్ష్యాలు పూర్తి చేయని

29 రైస్ మిల్లుల యజమానులతో ప్రత్యేకంగా సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, సివిల్ సప్లయ్స్ డీఎం అభిషేక్ సింగ్, ఏఎస్‌వో నిత్యానంద్, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్‌మిల్ అసోసియేషన్ ప్రతినిధులు, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

### రైతులకు అందుబాటులో ఎరువులు

కామారెడ్డి క్రైం : యాసంగి సీజన్‌కు గాను జిల్లాలోని రైతుల అవసరాలకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచామని జిల్లా సహకార అధికారి సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్‌కు ముందుగానే డబ్బులు చెల్లించి ఆయా సహకార సంఘాల పరిధిలోని రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు తెప్పించి సిద్ధంగా ఉంచాలని ఇదివరకే సహకార సంఘాల కార్యదర్శులను ఆదేశించామన్నారు. ఏదైనా సహకార సంఘంలో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత ఏర్పడితే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామన్నారు. సహకార సంఘాల ద్వారా ఎరువులు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### రోడ్డు విస్తరణ సర్వే వేగవంతం



నిజాంసాగర్(జుక్కల్) : హైదరాబాద్- బోధన్ ప్రధాన రహదారి విస్తరణకు సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయి. మెదక్-ఎల్లారెడ్డి, నిజాంసాగర్- బాన్సువాడ, బాన్సువాడ-నస్రుల్లాబాద్ మీదుగా రుద్రూర్, బోధన్ వరకు ఉన్న రోడ్డును జాతీయ రహదారిగా మార్చనున్నారు. రోడ్డు విస్తరణ పనులకు కేంద్రం ప్రభుత్వం నిధులివ్వడంతో సర్వే పనులు పూర్తి చేస్తున్నారు. అంతేకాకుండా రోడ్డు విస్తరణ పనులను నెలరోజుల్లో ప్రారంభించనున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

### నేడు గణిత ఫోరం ఆధ్వర్యంలో పోటీలు

కామారెడ్డి అర్బన్ : శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఈనెల 22న శుక్రవారం తెలంగాణ గణిత ఫోరం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్ తెలిపారు. గణిత ప్రతిభా పరీక్ష, గణిత పాటలు, ముగ్గులు, మెహందీ, మీలో ఎవరు రామానుజన్ క్విజ్, గణిత శాస్త్రవేత్తలు చరిత్ర, చిత్రలేఖనం, ఉపన్యాస, ల్యాబ్ పోటీలు నిర్వహిస్తారని గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్ వివరించారు.

### కేంద్ర హోంమంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఎంపీ ధర్మపురి అర్వింద్ గురువారం న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను అమిత్‌షా అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో దాదాపు సమానంగా బీజేపీకి ఓట్లు వచ్చాయని ఎంపీ వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి పలు విషయాలపై కూడా చర్చించారు.

## వికసిత్ భారత్ యాత్రకు స్పందన



చిన్నదగ్గిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార తదితరులు

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

బిచ్కుంద(జుక్కల్) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార అన్నారు. గురువారం చిన్నదగ్గిలో వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యాత్ర పార్టీకి సంబంధించినది కాదని కేంద్ర ప్రభుత్వం ద్వారా జరుగుతోందన్నారు. సర్పంచుల అధ్యక్షతన నోడల్ అధికారి, బ్యాంకు సిబ్బంది యాత్రలో పాల్గొంటారన్నారు. గ్రామాల్లో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అధికారికంగా వివరించి అవగాహన కల్పించామన్నారు. పేదలు ఈ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఉజ్వల పథకం, ఆయుష్మాన్ భారత్ పథకం, జీవన్ బీమా పథకం, కిసాన్ సమ్మాన్ నిధి, అటల్ పెన్షన్, విశ్వకర్మ యోజన ఎన్నో సంక్షేమ పథకాలు ఉన్నాయని వాటిని అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దంపతుల మృతదేహాల గుర్తింపు

- నిందితులను తీసుకెళ్లి మృతదేహాలను వెలికితీసిన పోలీసులు
- పంచనామా చేసి అక్కడే పూడ్చేశారు
- పూర్తయిన మృతదేహాల గుర్తింపు



ప్రసాద్ మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

మాక్లూర్/నవీపేట/ఖలీల్‌వాడి/సదాశివనగర్ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆరుగురి హత్య కేసులో నలుగురు మృతదేహాలు ఇప్పటికే లభించగా.. భార్యభర్తల మృతదేహాలను గురువారం పోలీసులు గుర్తించారు. ప్రసాద్ మృతదేహాన్ని మాక్లూర్ మండలం మదన్‌పల్లి శివారులో వెలికితీశారు. గురువారం తెల్లవారు జామున నిందితులను తీసుకువచ్చి ప్రసాద్‌ను చంపి పూడ్చిన స్థలాన్ని గుర్తించారు. స్థానిక తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, నార్త్ జోన్ సీఐ సతీశ్, స్థానిక ఎస్సై సుధీర్‌రావు, నవీపేట ఎస్సై యాదగిరి సమక్షంలో పంచనామా నిర్వహించారు. తల భాగం పూర్తిగా పగిలిపోయి ఉండడంతో తలనే టార్గెట్ చేసి కొట్టి చంపినట్లుగా తెలుస్తోంది. పంచనామా అనంతరం మృతదేహాన్ని అక్కడే పూడ్చిపెట్టారు.

**బాసర వంతెన కింద..**

అలాగే ప్రసాద్ భార్య రమణి మృతదేహాన్ని యంచ శివారులోని గోదావరి ఒడ్డున రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తించారు. ప్రసాద్ తల్లి సుశీల, అత్త కళావతిని వెంట తీసుకొచ్చిన పోలీసులు మృతదేహాన్ని రమణిగా నిర్ధారించారు. డిప్యూటీ తహసీల్దార్ హాజీ, వైద్యాధికారి సుధ ఆధ్వర్యంలో అక్కడే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి దహన సంస్కారాలు చేశారు. ఎల్లారెడ్డి ఏసీపీ శ్రీనివాస్‌రావు, సదాశివనగర్ సీఐ రామన్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రసాద్ కుటుంబం హత్య కేసులో నిందితులను సదాశివనగర్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు.

### రాయితో మోది, గొంతు నులిమి హత్యలు

ఆరుగురి హత్య కేసులో నిందితులు హతులను రాయితో మోది, గొంతు నులిమి హత్య చేశారు. గత నెల 29న ప్రసాద్‌ను ప్రశాంత్ డబ్బుల విషయమై మాట్లాడుకుందామని మదన్‌పల్లి అటవీప్రాంతానికి తీసుకెళ్లి మద్యం తాగించి రాయితో మోది హత్య చేసి అక్కడే గొయ్యి తవ్వి మృతదేహాన్ని పూడ్చి వేశారు. అనంతరం డిసెంబర్ 1న ప్రసాద్ భార్య రమణిని బాసరకు తీసుకెళ్లి గొంతు నలిపి చంపి గోదావరిలో పడేశాడు. ప్రసాద్ చెల్లెలు స్రవంతిని వడియారం వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి చంపి పెట్రోల్ పోసి కాల్చేశారు. ప్రసాద్ తల్లి సుశీల, ఇద్దరు కవల పిల్లలు చైత్రిక, చైత్రిక్‌తో పాటు మరో చెల్లెలు స్వప్నను నిందితులు నిజామాబాద్‌లోని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలోని ఓ లాడ్జిలో ఉంచారు. ప్రసాద్ పిల్లలను కారులో తీసుకెళ్లి గొంతునులిమి చంపేసి మెండోరా మండలం దూదిగాం వద్ద గోదావరి నదిలో పడేశారు. మరోచెల్లెలు స్వప్నను ఈనెల 13న సదాశివనగర్ మండలం భూంపల్లి వద్ద గొంతు నులిమి చంపి పెట్రోల్ పోసి తగలబెట్టారు.

# కరోనాతో అప్రమత్తంగా ఉండాలి

- ప్రాణనష్టం లేకుండా వైద్యసేవలందిస్తాం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలున్నాయి
- అందుబాటులో ఆక్సిజన్, ఐసీయూ, ఐసోలేషన్ బెడ్స్
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి



మళ్లీ ముంచుకొస్తున్న కోవిడ్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైరస్ వ్యాప్తి నివారణకు ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కామారెడ్డి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు జిల్లాస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె జిల్లా పరిస్థితులు, వైద్య సౌకర్యాలు, ఏర్పాట్లపై వివరాలు వెల్లడించారు.

– కామారెడ్డి టౌన్

సాక్షి ఇంటర్వ్యూ

ప్రశ్న: కోవిడ్ వ్యాప్తి చెందకుండా ఎలాంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు : ఇప్పటిదాకా జిల్లాలో వైరస్ ఆనవాళ్లు లేవు. కేసులు నమోదు కాలేదు. వైరస్ నివారణ కోసం ప్రజలు మాస్కులు ధరించాలి. సానిటైజర్, భౌతిక దూరంపై అవగాహన పెంచుతాం.

■ **జిల్లాలో ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ పరీక్షల కోసం ఏర్పాట్లు చేశారా..?**

■ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మాత్రం ఆర్టీపీసీఆర్ ల్యాబ్ ద్వారా పరీక్షలు చేస్తాం. బాన్సువాడ ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీలు ఎల్లారెడ్డి, దోమకొండ, మద్నూర్, పిట్లం, బిచ్కుంద, జుక్కల్, గాంధారీ ఆస్పత్రులోల ర్యాపిడ్ పరీక్షల కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. కిట్స్ సరఫరా కాగానే పరీక్షలు ప్రారంభిస్తాం.

■ **ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సౌకర్యం ఉందా..?**

■ ఆక్సిజన్ కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్స్ ఉన్నాయి. కామారెడ్డిలో 80, బాన్సువాడలో 40 బెడ్లకు 500 ఎల్‌పీఎం(లీటర్ ఫర్ మినిట్) ఆక్సిజన్ అందించేందుకు బెడ్స్ ఉన్నాయి. అలాగే ఇతర సీహెచ్‌సీలు 20 బెడ్స్‌ల చొప్పున ఏర్పాట్లలో ఆక్సిజన్ సిలిండర్‌లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్ ఉన్నాయి.

■ **బెడ్స్ అందుబాటులో ఉన్నాయా..?**

■ కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రత్యేక వార్డుతో పాటు 80 ఐసోలేషన్ బెడ్స్ అందుబాటులో ఉన్నాయి. బాన్సువాడలో 40, ఇతర సీహెచ్‌సీలో ప్రత్యేక వార్డులలో 15కి పైగా బెడ్స్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించాం. అవసరమైతే పెంచుతాం.

■ **కోవిడ్ కేసుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉంటే మీ చర్యలేమిటి..?**

■ కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మాత్రమే ఐసోలేషన్, ఐసీయూ, కోవిడ్ కేర్ వార్డులను ఏర్పాట్లు చేయబోతున్నాం. ప్రత్యేక బృందాలతో వైద్య సేవలను అందిస్తాం. ఫిజీషియన్లు, పల్మనాలజిస్టులు, సివిల్ సర్జిన్‌లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం.

■ **సరిపడా వైద్యులు, సిబ్బంది ఉన్నారా..?**

■ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సరిపడా వైద్యులు అందుబాటులో ఉన్నారు. వైద్యులు, సిబ్బంది ప్రత్యేక జాబితాను తయారు చేస్తాం. ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ పరీక్షలు చేయడానికి ఇంకా ల్యాబ్ టెక్నీషియన్లు కావాల్సి ఉంది. ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఇప్పడికైతే కోవిడ్ లక్షణాలతో ఎవరూ రావడం లేదు. కేసులు ఎక్కువైతేనే సిబ్బంది సరిపోరు.

■ **కోవిడ్ వైరస్‌పై ప్రజలకు మీరిచ్చే సందేశం?**

■ ఇప్పటికైతే జిల్లాలో కేసులు నమోదు లేదు. కానీ అప్రమత్తంగా ఉండాలి. మాస్కు ధరించాలి, సానిటైజర్ వాడాలి. భౌతికదూరం పాటించాలి. అత్యవసరమైతేనే బయటకురావాలి.

### ఆక్సిజన్ యంత్రాల దుమ్ము దులిపారు..

కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైరస్‌బారిన పడిన వారికి దమ్ము సమస్య ఏర్పడితే ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ యంత్రాలు ప్రధాన కీలకంగా పనిచేస్తాయి. గత కోవిడ్ కాలంలో వీటిని ఆయా ఆస్పత్రుల్లో వినియోగించారు. కోవిడ్ నివారణ అనంతరం వీటి వినియోగం అవసరం లేక స్టోర్‌రూంలలో ఉంచారు. ప్రస్తుతం రాష్ట్రంలో కోవిడ్ కేసులు నమోదు అవుతున్న తరుణంగా అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గురువారం స్టోర్ రూంలో ఉన్న ఆక్సిజన్ యంత్రాలను బయటకు తీసి దుమ్ము దులిపే పనిలో పడ్డారు. వాటిని పనిచేసేవిధంగా చూస్తామని, కోవిడ్ కేసులు వస్తే వినియోగంలోకి తీసుకోస్తామని అధికారులు తెలిపారు.



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆక్సిజన్ యంత్రాలను బయటకు తీసిన దృశ్యం

### కోవిడ్ వ్యాప్తిని నిరోధించాలి



డా.లక్ష్మణ్‌సింగ్, డీఎంహెచ్‌వో

కామారెడ్డి టౌన్ : దేశంలో కరోనా విజృంభిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లక్ష్మణ్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కరోనా తాత్కాలికమైన జలుబు లాంటిదని, తగిన జాగ్రత్తలు, వైద్య సలహాలు, సూచనలు పాటిస్తే తరిమికొట్టవచ్చన్నారు. వైద్యారోగ్య శాఖ కూడా కరోనాను ఎదుర్కొనేందుకు, కట్టడి చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. అందరం కలిసి కట్టుగా పోరాడి కరోనాను జయిద్దామన్నారు. కాగా ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరిస్తూ, భౌతిక దూరం పాటించాలని, తరచూ చేతులను శానిటైజ్ చేసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయట తిరగరాదని, తప్పని పరిస్థితులలో వెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలని, పెళ్లిళ్లకు, విందులు, వినోదాలకు దూరంగా ఉండాలన్నారు.

ప్రతిరోజూ గోరువెచ్చని నీరు తాగాలని, బలమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. జలుబు, జ్వరం లాంటివి వచ్చి తగ్గకపోతే వెంటనే డాక్టరును సంప్రదించాలన్నారు. పాజిటివ్ వస్తే బయపడొద్దని, ధైర్యంగా కుటుంబం సభ్యులను కలవకుండా ప్రత్యేక గదిలో ఉండాలని, లేదా ప్రభుత్వ కరోనా కేర్ సెంటర్‌లో చేరి వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవాలన్నారు.

## క్లుప్తంగా

### జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక


శ్రావ్యరెడ్డి

సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్ స్టేజీ వద్ద గల మహాత్మ గాంధీ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన శ్రావ్యరెడ్డి అండర్–17 బాలికల విభాగంలో జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాగిణి తెలిపారు. జనవరిలో కర్ణాటకలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు.

**వాలీబాల్ పోటీలకు..**


మహ్మద్ అర్షద్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థి మహ్మద్ అర్షద్ విశ్వవిద్యాలయాల జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అర్షద్ పాల్గొని జాతీయ స్థాయ క్రీడలకు ఎంపికయ్యారు. బెంగుళూర్‌లో నిర్వహించే పోటీల్లో అర్షద్ పాల్గొంటారని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఇన్‌చార్జి పీడీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

### పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి సూచించారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లా విద్యాధికారులతో గురువారం సమీక్షించారు. ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు, పలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. ఇందుకు సంబంధించి ఎంఈవోలు, హెచ్‌ఎంలు అప్రమత్తంగా ఉండి ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్,డీఈవో దుర్గాప్రసాద్ ఉన్నారు.

**కల్లెడ ఘటనపై విచారణకు ఆదేశం**

మాక్లూర్ మండలం కల్లెడ ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకున్న గంజాయి ఘటనపై విచారణ చేపట్టాలని ఎంఈవోను డీఈవో దుర్గాప్రసాద్ ఆదేశించారు. సామగ్ర నివేదిక అందించాలన్నారు.

### 23న క్రిమినల్ చట్టాలపై సెమినార్


ఖలీల్‌వాడి: రాష్ట్ర బార్ కౌన్సిల్, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సివిల్, క్రిమినల్ చట్టాలపై శనివారం సెమినార్ నిర్వహించనున్నట్లు బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, బార్ అధ్యక్షుడు దేవదాసు గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో నిర్వహిస్తున్న సెమినార్‌కు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సెమినార్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పాల్గొంటారని అన్నారు.

### పాలిటెక్నిక్‌లో సృజన టెక్ ఫెస్ట్ పోటీలు

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్‌ను గురువారం నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ మహిళా, బాలుర, నందిపేట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తమ ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఉత్తమ ప్రదర్శన నిర్వహించిన జట్లకు బహుమతులను అందజేశారు. బీఎస్ఎన్ఎల్ మంచిర్యాల ఎస్‌డీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# అర్జునధారికి ప్రశంసల వెల్లువ

- హుస్సాముద్దీన్‌కు అర్జున అవార్డు
- ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమంటున్న బాక్సర్



బాల్యంలో తన తండ్రి శంశొద్దీన్ వద్ద శిక్షణ తీసుకుంటున్న హుస్సాముద్దీన్

నిజామాబాద్‌నాగారం: భారత ప్రభుత్వం క్రీడాకారుల సేవలకు గుర్తింపుగా అందించే అర్జున అవార్డు ఇందూరు బాక్సింగ్ క్రీడాకారుడు హుస్సాముద్దీన్‌కు వరించింది. బాక్సింగ్ కోచ్ అయిన తన తండ్రి శంశొద్దీన్ వద్దే ఓనమాలు నేర్చుకుంటు క్రీడలో తనదైన శైలిలో ముద్రవేసుకుంటున్నాడు. ఎంతో ప్రతిష్టాత్మకమైన అర్జున అవార్డును సాధించి అందరి చూపును జిల్లావైపు మలిచాడు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు, అభిమానులు ఆయనకు ప్రశంసల వర్షం కురిపించారు.

నగరంలోని పాటిగల్లీలో ఉండే ఎండీ శంశొద్దీన్ ఐదో సంతానం మహ్మద్ హుస్సాముద్దీన్. తండ్రి బాక్సింగ్ కోచ్ కావడంతో ప్రతి రోజు శిక్షణ తీసుకుంటు ఓనమాలు నేర్చాడు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటు బాక్సింగ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే స్థాయికి ఎదిగాడు. డిగ్రీ పూర్తి చేసి ఆర్మీకి ఎంపికైనా బాక్సింగ్‌లో తన సత్తా చాటుతూ అందరినీ ఆశ్చర్య పరుస్తున్నాడు. ఒలింపిక్‌లో ఎలాగైనా పతకం సాధించాలన్న పట్టుదలతో పంజాబ్‌లోని పటియాలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నాడు హుస్సాముద్దీన్.

**గతేడాది నిఖత్‌జరీన్‌కు..**

జిల్లా నుంచి ఇప్పటి వరకు బాక్సింగ్ క్రీడలో గతేడాది జిల్లా క్రీడాకారిణి అయిన నిఖత్‌జరీన్‌కు అర్జున అవార్డు వచ్చింది. ఈ ఏడాది సైతం జిల్లాకు చెందిన హుస్సాముద్దీన్‌కు అర్జున అవార్డు దక్కడంపై జిల్లా క్రీడాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అంతర్జాతీయ స్థాయిలో..**

హుస్సాముద్దీన్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రత్యర్థులను తన బలమైన షాట్‌లతో ఓడిస్తూ అనేక పతకాలు సాధించాడు. 2015 కొరియాలో నిర్వహించిన వరల్డ్ బాక్సింగ్‌లో కాంస్య పతకం, 2017 బల్గేరియాలో రజతం, మంగోలియాలో కాంస్య పతకం, 2018 ఢిల్లీలో ఓపెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో, బల్గేరియా, ఆస్ట్రేలియాలో నిర్వహించిన పోటీల్లో వరుసగా కాంస్య పతకాలు, జర్మనీలో బంగారు పతకం సాధించి విజయం పొందాడు. 2019లో ఫిన్‌లాండ్, పోలాండ్, థాయ్‌లాండ్‌లో రజత పతకాలు, 2020 బల్గేరియాలో కాంస్యం, చైనాలో బంగారు, జర్మనీలో కాంస్యం, 2021 స్పెయిన్‌లో రజతం, 2022 బర్మింగ్‌హోమ్ కామన్ వెల్త్ క్రీడల్లో కాంసన్య, జోర్డాన్‌లో కాంస్యం, 2023 తాష్కెంట్ దేశంలో నిర్వహించిన వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు.

### 35 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా

నేను 35 ఏళ్లుగా బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తున్నా. ఇప్పటి వరకు 160కి పైగా క్రీడాకారులు నా వద్ద శిక్షణ తీసుకున్నారు. ఇందులో 100కుపైగా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించారు. ఆరుగురు అంతర్జాతీయస్థాయికి ఎదిగారు. ఇందులో ముగ్గురు నా కుమారులు ఉన్నారు. ఒక్కరు రైల్వేలో, మరొకరు ఆర్మీలో ఉద్యోగం చేస్తుండగా హుస్సాముద్దీన్ ఆర్మీలో ఉండి దేశానికి పతకాలు తీసుకు రావడానికి శ్రమిస్తున్నాడు. ప్రతి ఏడాది 30కిపైగా క్రీడాకారులు నావద్ద శిక్షణ తీసుకుంటున్నారు.

– శంశొద్దీన్, బాక్సింగ్ కోచ్

### అవార్డుతో జిల్లాకు కీర్తి



హుస్సాముద్దీన్‌కు అర్జున అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. గతేడాది నిఖత్‌జరీన్‌కు వచ్చింది. బాక్సింగ్‌లో కఠోరంగా సాధన చేస్తేనే ఇలాంటి అవార్డులు, పతకాలు అందుతాయి. అర్జున అవార్డుతో జిల్లా కీర్తి మరింత పెరిగింది. ఇదే స్ఫూర్తితో కొత్త క్రీడాకారులు తయారవుతారు.

– శివసాయి, జాతీయస్థాయి క్రీడాకారిణి

### స్ఫూర్తిగా నిలిచాడు..



జిల్లాకు కీర్తి తెచ్చిన హుస్సాముద్దీన్ మాలాంటి బాక్సింగ్ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచాడు. అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను చూసే బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. కచ్చితంగా నేను ఈ స్థాయికి చేరుకునేలా నిరంతం శ్రమిస్తా.

– సొహెల్, జిల్లా క్రీడాకారుడు

### నేటి తరానికి ఆదర్శం



నేటితరం క్రీడాకారులకు హుస్సాముద్దీన్ ఆదర్శంగా నిలిచాడు. చిన్నప్పటి నుంచి బాక్సింగ్ క్రీడనే జీవితంగా ముందుకు కదిలాడు. అందుకు తగిన ప్రతిఫలం ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉంది. హుస్సాముద్దీన్‌కు జిల్లా క్రీడాకారుల తరపున తామంతా సలామ్ చేస్తున్నాం.

– సయ్యద్‌కులీసామ్, రాష్ట్ర స్థాయి క్రీడాకారుడు

### దేశానికి మంచి పేరు తేవాలి



జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన హుస్సాముద్దీన్‌కు ప్రత్యేకంగా అభినందనలు. అర్జున అవార్డు సాధించి మాకు స్ఫూర్తిగా నిలిచాడు. మేము కూడా నిరంతరం సాధన చేసి ఉన్నతంగా ఎదుగుతాం. ఒలింపిక్స్‌లో సైతం విజయం సాధించి దేశానికి పేరు తేవాలి.

– కుతుబుద్దీన్, రాష్ట్ర స్థాయి క్రీడాకారిణి

### ఈ - కేవైసీ కోసం పడిగాపులు


సుల్తాన్‌నగర్ హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వద్ద బారులు తీరిన వినియోగదారులు

నిజాంసాగర్/బిచ్కుంద: ఈ–కేవైసీ కోసం వినియోగదారులు నిత్యం గ్యాస్ డీలర్ల వద్ద బారులు తీరుతున్నారు. మారుమూల గ్రామాల నుంచి ఆయా డీలర్ల వద్దకు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. నిజాంసాగర్ మండలంలోని సుల్తాన్‌నగర్ హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద గురువారం గ్యాస్ వినియోగదారులు బారులు తీరారు. బిచ్కుంద ఇండేన్ గ్యాస్ కార్యాలయం వద్ద మహిళలు బారులు తీరారు.


బిచ్కుందలో ఇండేన్ గ్యాస్ కార్యాలయం వద్ద..

### అద్దె బస్సుల చార్జీలు పెంచాలి



ఖలీల్‌వాడి: మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు వస్తుండటంతో అద్దె బస్సులకు చెల్లించే చార్జీలను పెంచాలని హైర్ బస్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్, జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం ఆర్ఎం జానీరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మహాలక్ష్మి పథకం అమలు కాకముందు అద్దె బస్సుల్లో సరాసరి 50 మంది ప్రయాణించే వారని ఇప్పుడు 100 మందికి పైగా ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. కెపాసిటీ పెరగడంతో బస్సులు గమ్యానికి చేరడంలో ఆలస్యం అవుతుందని చెప్పారు. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులకు మెయింటెన్స్ ఛార్జీలు ఎక్కువ అవుతున్నాయని, దానికి తగినట్లుగా తమకు చెల్లించే చార్జీలను పెంచాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, గణేష్, భీమయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### వర్సిటీ ఇంటర్ కళాశాల అథ్లెటిక్స్ ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెయూలోని వర్సిటీ క్రీడా మైదానంలో ఇంటర్ కళాశాల అథ్లెటిక్స్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తెయూ క్రీడా విభాగం డైరెక్టర్ బాలకిషన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి సౌత్ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు తెయూ తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 29 నుంచి జనవరి 1 వరకు తమిళనాడులో నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ అట్లాంటిక్ (మెన్) టోర్నమెంట్‌లో తెయూ జట్టు సభ్యులు పాల్గొంటారని డైరెక్టర్ బాలకిషన్ తెలిపారు. పోటీల్లో 9 కళాశాలల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు అనిల్ కుమార్, రాంకిషన్, సౌమ్య, జూనియర్ అసిస్టెంట్ నరేశ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.


అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న తెయూ క్రీడావిభాగం డైరెక్టర్ బాలకిషన్


కామారెడ్డిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

# బీజేపీ నాయకుల నిరసన

సాక్షి నెట్‌వర్క్: రాజ్యసభ చైర్మన్, ఉప రాష్ట్రపతి జగదీశ్ ధన్‌ఖడ్‌ను అనుకరిస్తూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ అవహేళన చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆందోళనలు చేశారు. ఎంపీ కల్యాణ్ బెనర్జీ అవహేళన చేసే సమయంలో ఆ తతంగాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వీడియో తీయటం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయటమేనని బీజేపీ నాయకులు తప్పుపట్టారు. పార్లమెంటు ఉభయ సభలలో సమావేశాలు సక్రమంగా నిర్వహించకుండా కాంగ్రెస్ ఎంపీలు అడ్డుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని, వెంటనే రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు.


నస్రుల్లాబాద్‌లో..


భిక్కనూరులో..


బీబీపేటలో ..


సదాశివనగర్‌లో..


బాన్సువాడలో ..


దోమకొండలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

### అబ్జర్వర్‌గా గంగామోహన్

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు అబ్జర్వర్‌గా మిట్టాపల్లి పీఈటీ మర్కంటి గంగామోహన్ ఎంపికయ్యారు. ఈనెల 21 నుంచి 23 వరకు నిర్మల్‌లో నిర్వహిస్తున్న అండర్–17 సాఫ్ట్‌బాల్ రాష్ట్ర పోటీలకు గంగామోహన్ ఎంపికయ్యారు. అనంతరం జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సంగీతరావు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నవీన్, పలువురు గంగామోహన్‌ను అభినందించారు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న లయన్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ లయన్ బ్రియాన్ ఈ-సీహాన్


బ్రియాన్ ఈ సీహాన్‌ను సన్మానిస్తున్న బోధన్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బోధన్: బోధన్ లయన్స్ క్లబ్, కంటి ఆస్పత్రి ద్వారా 21 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయమని లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్, లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు లయన్ బ్రియాన్ ఈ–సీహాన్ అన్నారు. తాను అమెరికా నుంచి వచ్చి ఇక్కడ లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు అందిస్తున్న సేవలను చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో ఎడపల్లి శివారులో రూ.3 కోట్ల నిర్మించిన వృద్ధాశ్రమం, బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రిలో రూ.కోటితో నిర్మించిన ఆడిటోరియం, కంటి ఆపరేషన్ థియేటర్‌లను ఆయన గురువారం ప్రారంభించారు. బోధన్‌కు చెందిన లయన్స్ క్లబ్ జిల్లా 320 గవర్నర్ వేమూరి లక్ష్మి క్రియాశీలకంగా పని చేస్తూ దేశంలో రెండోస్థానంలో నిలిచారని కొనియాడారు. లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆఫ్ బోధన్ వ్యవస్థాపకులు పోలవరపు బసవేశ్వర్‌రావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా కంటి ఆస్పత్రిని నడిపిస్తూ, మరో మూడు కొత్త శాఖలను ప్రారంభించి పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉందన్నారు. ముఖ్య అతిథిని క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కార్యదర్శి విజయకుమార్ రాజు, చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రతాప్‌గుప్తా, శశిభూషణ్, పెంటయ్య, కొడాలి కిశోర్, అమర్‌నాథ్ రావు, నాగరాజు, శ్రీనివాస్‌రావు, ఉమేష్ షిండే, విజయ్‌కుమార్, సూర్యనారాయణ, కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.



## క్రైం కార్నర్

### ఇరువర్గాలపై కేసు నమోదు


మాట్లాడుతున్న ఎస్సై మురళి

దోమకొండ: మండల కేంద్రంలో బుధవారం రాత్రి ముగ్గురు మహిళల హల్‌చల్ కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. పీఎస్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగేళ్ల క్రితం మాచారెడ్డి మండలం లచ్చాపేటకు చెందిన బూస సత్యనారాయణ–కవిత దంపతులకు దోమకొండకు చెందిన పందిరి కాశీనాథ్ అప్పు ఇచ్చాడు. రెండేళ్ల క్రితం కవిత భర్త సత్యనారాయణ చనిపోగా, కవిత ఇల్లు అమ్మి అప్పుచెల్లించింది. కానీ అప్పు చెల్లించలేదని కాశీనాథ్ చెక్‌బౌన్స్ కేసు పెట్టాడని, దీంతో కవిత కూడా కాశీనాథ్‌పై వేధింపుల కేసు పెట్టిందన్నారు. ఇరువురు కేసు రాజీచేసుకోవాలని నిర్ణయించగా, ముందుగా కవిత తన కేసును విరమించుకోగా కాశీనాథ్ మాత్రం కేసు విరమించుకోలేదు. దీంతో కవిత బుధవారం రాత్రి తన స్నేహితులైన సరిత, సానియాబేగంతో కలిసి కాశీనాథ్ ఇంటికి వచ్చారు. ఇరువురి మధ్య గొడవ జరుగగా దొంగతనానికి వచ్చారనే భయంతో కాలనీవాసులు ముగ్గురు మహిళలపై దాడిచేసి పోలీసులకు అప్పగించారు. విచారణలో అసలు విషయాలు బయటకు వచ్చినట్లు తెలిపారు. తనపై దాడిచేశారంటు కాశీనాథ్ అతని భార్యపై కవిత ఫిర్యాదు చేయగా, తన ఇంట్లో దొంగతానికి యత్నించారని కాశీనాథ్ ఫిర్యాదు ముగ్గురు మహిళలు కవిత, సరిత, సానియాబేగంపై ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### పొతంగల్ విండో మాజీ చైర్మన్ మృతి



రుద్రూర్: పొతంగల్ విండో మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి అనారోగ్యంతో గురువారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. రెండు సార్లు పొతంగల్ విశాల సహకార సంఘం అధ్యక్షుడిగా, మూడు సార్లు కల్లూర్ సర్పంచ్‌గా, బోధన్ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పని చేశారు. పలువురు నాయకులు సంతాపం తెలిపారు. స్వగ్రామంలో శుక్రవారం అంత్యక్రియలు ని ర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

# విద్యార్థుల ఆటోను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్రగాయాలు


ఆస్పత్రిలో విద్యార్థినికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

జక్రాన్‌పల్లి/ఖలీల్‌వాడి: పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటన గురువారం మండలంలోని సికింద్రాపూర్ పరిధిలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు.. జక్రాన్‌పల్లి మండలం బాలానగర్‌కు చెందిన 14 మంది విద్యార్థినులు సికింద్రాపూర్‌లోని ఉన్నత పాఠశాలకు వెళ్లడానికి ఆటో ఎక్కారు. ఆటో కొద్ది దూరం వెళ్లగానే హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, 11 మంది స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గాయాలైన విద్యార్థినులకు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వారిని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పరిశీలించారు. స్వల్పంగా గాయపడిన వారిని వైద్యులు డిశ్చార్జ్ చేశారు. తీవ్రంగా గాయపడ్డ అంకిత, నిఖిత, అటుకావర్ అంకితలు వైద్యులు అబ్జర్వేషన్‌లో ఉన్నారు. ఆటోను ఢీకొట్టిన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### దుబ్బాక వీడీసీ సభ్యులపై కేసు

ఖలీల్‌వాడి: ధర్పల్లి మండలంలోని దుబ్బాక వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ జయరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో పద్మశాలి కులానికి చెందిన భూమిని వీడీసీ వారు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. ఈ భూ వివాదంలో వీడీసీ సభ్యులు 40 మంది పద్మశాలి కుటుంబాలను బహిష్కరించి వారికి రూ.50 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో విచారణ జరిపి వీడీసీ సభ్యులైన కొత్తి రాజశేఖర్ అలియాస్ శేఖర్ రెడ్డి, పెండ అరుణ్ అలియాస్ అర్జున్, దొంకెన చిన్న గంగారాం, భుర్కి నర్సాగౌడ్ అలియాస్ చేగంటి నర్సాగౌడ్, భూమేడ మురళిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### కౌలు డబ్బులు దేవాదాయ శాఖకే చెల్లించాలి

నిజామాబాద్ సిటీ: నగరంలోని బడా రాం మందిర్ (బ్రహ్మపురి పెద్ద రాంమందిరం)కు చెందిన భూముల కౌలుదారులు తమ కిస్తీ డబ్బులను నిజామాబాద్ దేవాదాయ, ధర్మాదాయ శాఖకే చెల్లించాలని ఉమ్మడి జిల్లాల దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 25న బడా రాం మఠాన్ని దేవాదాయ శాఖ పరిపాలన కింద తీసుకున్నట్లు పేర్కొన్నారు. మఠం పరిధిలోగల వ్యవసాయ భూములను కౌలు పద్ధతిలో సాగు చేస్తున్న వారు ఇక నుంచి కౌలు డబ్బులను మఠం ఫిట్‌పర్సన్ జి వేణుకు చెల్లించాలని సూచించారు. ఏ ఇతర ప్రైవేట్ వ్యక్తులతో మఠానికి సంబంధం లేదని తెలిపారు. కౌలు చెల్లించకుంటే ఆయా సర్వే నంబరులో గల భూములను బహిరంగ వేలం ద్వారా కౌలుకు ఇస్తామని పేర్కొన్నారు.

### అమీనాపూర్ వీడీసీపై కేసు నమోదు

వేల్పూర్: మండలంలోని అమీనాపూర్‌లో ఉన్న 35 ఎస్సీ మాల కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేసిన 9 మంది వీడీసీ సభ్యులపై ఆర్మూర్ ఏసీపీ జగదీశ్‌చందర్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వినయ్‌కుమార్ గురువారం పేర్కొన్నారు. వీడీసీ సభ్యులు 24 మందిపై కేసు నమోదు చేయగా 9 మంది అరెస్టు కాగా మిగతా వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక పనులు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.